హ్యాపీ జర్నీ..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభం

- తొలిరోజే విశేష స్పందన
- బస్సుల్లో మిఠాయిల పంపిణీ
- వివిధ వర్గాల మహిళల ఆనందం



ఆర్టీసీ బస్సులో మహిళలకు స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు





బస్సులకోసం వేచిఉన్న మహిళలు

కాచిగూడ: కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం శనివారం ఆర్టీసీ కాచిగూడ, బర్కత్‌పుర డిపోల పరిధిలో ప్రారంభమైంది. ఉచిత ప్రయాణం పట్ల మహిళలు, విద్యార్థినిలు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యల్లో బస్సుల్లో ప్రయాణించి మహిళలకు స్వీట్స్ పంపిణీ చేశారు. బస్టాపుల్లో వేచి ఉన్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అవగాహన కల్పించారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి నెల రూ.5వేల నుంచి రూ. 10 వేల వరకు ఆదా అవుతుందని మహిళలు పేర్కొన్నారు. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

బస్సుల సంఖ్య పెంచాలి



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం ఆనందంగా ఉంది. కాలేజీ సమయాల్లో ఇప్పటికే బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణిస్తున్నాం. ఇప్పుడు ఉచిత ప్రయాణంతో మరింత ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ నేపథ్యంలో బస్సుల సంఖ్యను పెంచి మహిళలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన అవసరం ఉంది. – దీపిక, విద్యార్థిని, అంబర్‌పేట

అందరికీ ఉపయోగకరం



ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం మాలాంటి పేద మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. నేను కేటరింగ్ పని చేస్తుంటా, ఇంటి నుంచి వివిధ ప్రాంతాల్లో పనికి వెళ్లేందుకు నెలకు రూ. 2వేల వరకు ఖర్చు అవుతుంది., ఇప్పుడు ఆ సొమ్ము మిలుగుతుంది. ఇంట్లో ఆ డబ్బులు ఇతర అవసరాలకు వాడుకోవచ్చు. – అలివేలు, క్యాటరింగ్ కార్మికురాలు, బర్కత్‌పుర

సీఎం చల్లగా ఉండాలి



రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పది కాలాల పాటు చల్లగా ఉండాలి. నాలాంటి నడవలేని వృద్ధ మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతుంది. ఒక్క స్టాప్ వరకైనా బస్సులో ప్రయాణించే అవకాశం ఉండటంతో ఇక నుంచి బస్సులో ప్రయాణిస్తా. బస్సులు అందుబాటులో ఉండేలా చూడాలి. – జంగమ్మ, నల్లకుంట

అలరించిన సంగీత స్వరధార

చిక్కడపల్లి: సుప్రసిరి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో శనివారం రాత్రి స్వర్ణయుగ సినీ సంగీత సంబురాలు శీర్షికతో నిర్వహించిన 12 గంటల నిర్విరామ సంగీత స్వరధార అలరించింది. గాయనీ గాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న ఏకగళ, యుగళ చిత్రగీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త దూరదర్శన్ పూర్వ సంచాలకులు పాలకుర్తి మధుసూదరన్‌రావు గాయనీ గాయకులను సన్మానించారు. రసమయి సంస్థ అధినేత ఎంకే రాము, ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, వంశీ రామరాజు, నిర్మల, కలగా కృష్ణమోహన్, వీకే దుర్గ, ఉమాకాత్యాయని పాల్గొన్నారు.

18న వీరభద్రస్వామి కల్యాణం



ఎమ్మెల్యే జాతోరాం చంద్రనాయక్‌ను ఆహ్వానిస్తున్న కాసుల వినోద్ తదితరులు

కాచిగూడ: శ్రీ వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకల్లో ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని డోర్నకల్ ఎమ్మెల్యే జాతోరాం చంద్రనాయక్ అన్నారు. శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం ఈ నెల 18న కర్మన్‌ఘాట్‌లోని ఏపీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్న వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ వేడుకలకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే జాతోరాం చంద్రనాయక్‌ను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో రఘు రాంరెడ్డి, సురేందర్ రెడ్డి, నర్ర సాయికిరణ్, కాసుల మల్లికార్జున్, మించు ఆనంద్, మార్గం విజయ్ పటేల్, నర్సింహ, మించు విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

ఉచిత బస్సు సౌకర్యం మహిళలకు వరం



మిఠాయిలు పంచుతున్న శంబుల ఉషశ్రీ

అంబర్‌పేట: మహిళలకు ఉచిత ప్రయాణ పథకం వరమని కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ అన్నారు. శనివారం అంబర్‌పేట్‌లో పథకం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మహిళా ప్రయాణికులకు మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ఐటీ శాఖ మంత్రికి అభినందనలు



మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును అభినందిస్తున్న నీరడి భూపేష్ సాగర్

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబును బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నేత నీరడి భూపేష్ సాగర్ ఆధ్వర్యంలో బీసీ నేతలు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బీసీ సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఆశాభావంవ్యక్తం చేశారు.

నేడు శ్రీ సుదర్శన మహా ఇష్టి

కాచిగూడ: నమిలకొండ శ్రీధరాచార్యుల యాజ్ఞిక నిర్వహణలో ఈనెల 10న బర్కత్‌పురలోని హౌసింగ్‌బోర్డు కాలనీ పార్కులో 'శ్రీ సుదర్శన మహా ఇష్టి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు, బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎం.సందీప్ రెడ్డి, పాడిశెట్టి కిషోర్, శరత్ శ్యామ్ తెలిపారు. ఉదయం 6:30 గంటలకు శ్రీ విశ్వక్షేణ ఆరాధన, వాసుదేవ పుణ్యాహవాచనము, 8 గంటలకు సుదర్శన హవనం, 11:50 గంటలకు మహా పూర్ణాహుతి, పండిత సన్మానం, యజమానులకు వేద ఆశీర్వచనం, ఉదయం 12:30 గంటలకు తీర్థ ప్రసాద గోష్టి ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరారు.

సత్కారం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిక్కడపల్లి సీఐగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన సీతయ్యకు ఈస్ట్ సిటీ జ్యూవెలర్స్ అధ్యక్షులు కందూరి కృష్ణ, కార్యదర్శి దామోదర్ జెయిన్, సభ్యులు వల్లభ్, గాంధీ జైయిన్ శనివారం బొకే అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. చట్టాన్ని అమలు చేయడంలో వ్యాపారులు తమకు సహాయ సహకారాలు అందించాలని ఇన్‌స్పెక్టర్ కోరారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక సత్యనారాయణ వ్రతాలు

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం చైర్మన్ డి.శివముదిరాజ్ ఆధ్వర్యంలో భోలక్‌పూర్ దేవుని తోటలోని భవానీ శంకర ఆలయ ప్రాంగణంలో శనివారం సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 300 జంటలు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సదా, చీఫ్ అడ్వైజర్ వీరేష్, కమిటీ నాయకులు కృష్ణ, నాగరాజు, కిట్టూ, కేశవ్, గిరి, వెంకటేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు



అవగాహన సదస్సులో పాల్గొన్న పీవీ రమణకుమార్ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎంబీఏ విద్యార్థులకు వ్యాపార, వాణిజ్య రంగాల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యా సంస్థల జాయింట్ సెక్రటరీ పీవీ రమణకుమార్ అన్నారు. శనివారం అంబేడ్కర్ ఎంబీఏ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన విద్యార్థులకు స్వాగతం పలికి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పీవీ రమణకుమార్ మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాన్ని, పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుబాటులో ఉన్న అవకాశాలను వివరిస్తూ పరిశ్రమలకు సంబంధించిన నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. బహుళ జాతి కంపెనీల్లో ఎంబీఏ విద్యార్థులకు అనేక అవకాశాలు లభిస్తాయన్నారు. కమ్యూనికేషన్, నిబద్ధత విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇస్తుందన్నారు. ప్రపంచంతో పోటీ పడేందుకు విద్యార్థులు జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్రీరాములు సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జి.సరోజా వివేక్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.రిషికాంత్, అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్లు కె.రత్న, డాక్టర్ పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి, డాక్టర్ జి.వినోద్ ఎమ్మెల్యేలుగా గెలుపొందడం పట్ల అభినందనలు తెలిపారు.

టీఎన్‌జీఓ నేతల అభినందన



సీఎం రేవంత్‌రెడ్డిని అభినందిస్తున్న టీఎన్‌జీవో నేతలు

కాచిగూడ: సీఎం రేవంత్ రెడ్డిని టీఎన్‌జీఓ సెంట్రల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు, భాగ్యనగర్ టీఎన్‌జీఓస్ గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ ముత్యాల సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవో నేతలు కస్తూరి వెంకటేశ్వర్లు, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్‌కు సత్కారం



భూక్యా యశ్వంత్‌ను సత్కరిస్తున్న బండారు దత్తాత్రేయ

ముషీరాబాద్: అంతర్జాతీయ యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్‌ను హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ శనివారం రాంనగర్‌లోని తన నివాసంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే ప్రపంచంలోని పలు పర్వతాలను అధిరోహించి భారత జాతి కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయంగా చాటి చెప్పారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన సాధించిన రికార్డులు, సర్టిఫికెట్లు, ఫొటోలను పరిశీలించారు. మహబూబాబాద్ జిల్లా, భూక్యా తండాకు చెందిన భూక్యా యశ్వంత్ తన 15వ ఏటనే పర్వతారోహణపై ఆసక్తి పెంచుకున్నాడు. భువనగిరిలోని రాక్ క్లైంబింగ్ స్కూల్‌లో శిక్షణ పొందిన అతను ఇప్పటి వరకు సౌత్ ఆఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో, యూరప్‌లోని మౌంట్ ఎల్‌బ్రస్ను, ఆస్ట్రేలియాలోని మౌంట్ కోసిస్కో హిమాచల్ ప్రదేశ్‌లోని మౌంట్ యూనామ్ పర్వతాన్ని మౌంట్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఆర్మీలో చేరాలని ఉన్నట్లు యశ్వంత్ తెలిపాడు.

బీసీ కులగణనపై తీర్మానం చేయాలి



మాట్లాడుతున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో కుల గణనపై కేబినెట్ తీర్మానం చేయాలని బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర అధ్యక్షులు దాసు సురేష్ డిమాండ్ చేశారు. ప్రగతి భవన్‌ను జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌గా మార్చడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. బీసీలకు గత ప్రభుత్వ హయాంలో తీరని అన్యాయం జరిగిందన్నారు. బీసీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక బడ్జెట్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బీహార్ తరహాలో వెంటనే కుల గణన చేపట్టేందుకు కేబినెట్ తీర్మానం చేయాలన్నారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం సీట్లు పెరుగుతాయన్నారు. బీసీ ఫెడరేషన్‌లు, కార్పొరేషన్‌లకు పాలక మండలి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బండారు పద్మావతి, మారెపల్లి లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి గోషిక స్వప్న, మట్టి జయంతి, దుర్గేష్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ హాకీ క్లబ్ పోటీలకు 'హైమావతి' విద్యార్థులు



హాకీ టోర్నమెంట్‌కు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ నిరంజన్

అంబర్‌పేట్: సికింద్రాబాద్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న హాకీ పోటీలకు అంబర్‌పేట ప్రేమ్ నగర్‌కు చెందిన హైమావతి పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. 14 ఏళ్ల లోపు పాఠశాల విద్యార్థులకు నిర్వహించే ఈ పోటీలకు తమ పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక కోచ్ నేతృత్వంలో వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హైదరాబాద్ స్థాయి హాకీ టోర్నమెంట్‌కు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బాలప్పబాడలో మంచినీటి సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: బర్కత్‌పుర, బాలప్పబాడ బస్తీలో గత కొంత కాలంగా ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలియడంతో స్థానిక కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ శనివారం బాలప్పబాడలో జలమండలి అధికారులతో కలిసి పర్యటించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్య సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జలమండలి ఏఈ భావన, బీజేపీ నేతలు కన్నె రమేష్ యాదవ్, హజారి బాబు, మల్లికార్జున్, బాలప్రసాద్, బి.భీమ్‌రాజ్, ఆర్.సంతోష్, రవియాదవ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నృత్యోపాసన పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: నృత్యమాల అకాడమీ ఆఫ్ ఇండియన్ డ్యాన్సెస్ ఆధ్వర్యంలో నృత్యోపాసన శీర్షికతో నృత్య ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు అకాడమి అధ్యక్షురాలు మాధవిమాల, డైరెక్టర్ ఎస్.సుధామాల తెలిపారు. 45 మంది యువ కళాకారులు కూచిపూడి నృత్యశైలిలో 12 వివిధ అంశాలను ప్రదర్శిస్తారన్నారు. ఈ మేరకు చిక్కడపల్లిలో శనివారం నృత్యోపాసన పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర ఆవిష్కరించారు. తిలక్‌రోడ్డులోని తెలంగాణ సారస్వతపరిషత్ హాల్‌లో ఈ నెల 11న సాయంత్రం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కావ్యచంద్రిక, మేఖల, కృతి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



మహిళా ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న సందీప్‌గౌడ్, బిజ్జ శత్రువు

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పని చేస్తారని ముషీరాబాద్ మాజీ ఎమ్మెల్యే, ఆల్ ఇండియా కాంగ్రెస్ కిసాన్‌సెల్ వైస్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శనివారం మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిధి పెంపు, సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భాలను పురస్కరించుకుని బస్సు ప్రయాణీకులకు స్వీట్లు పంపిణి చేసి రెయిన్‌బో హోమ్‌లో కేక్‌కట్ చేశారు. టీపీసీసీ కార్యదర్శి జి.ఎస్.కేశవ్, అభిషేక్‌రెడ్డి, తేజాగౌడ్, వేణుబాబుగౌడ్, ఖురేషి, శ్రీధర్, భానుప్రకాష్, దస్తగిరి పాల్గొన్నారు.

- సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని పులి సందీప్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు స్వీట్లు పంపిణీ చేశారు.
- ముషీరాబాద్ డివిజన్ శివాలయం చౌరస్తాలో కాంగ్రెస్ సేవా దళ్ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షురాలు పట్నం స్వప్నగౌడ్ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని తెలిపారు.
- భోలక్‌పూర్ డివిజన్ కాంగ్రెస్ గ్రేటర్ నాయకురాలు మేడి మధురవాణి ఆధ్వర్యంలో బస్సు ప్రయాణికులకు స్వీట్లు పంపిణీ చేశారు.



పిల్లలకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వీహెచ్, రోహిణ్‌రెడ్డి



పటేల్‌నగర్‌లో..

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ నేత, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు ఆధ్వర్యంలో శనివారం కాచిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు, అంబర్‌పేట అభ్యర్థి డాక్టర్ సి.రోహిన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పేదలకు స్వీట్స్, వృద్ధులకు దుప్పట్లు, దుస్తులు, ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

అంబర్‌పేట్: కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ జన్మదిన వేడుకలను శనివారం అంబర్‌పేట నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. డీడీ కాలనీలో జరిగిన వేడుకలకు మాజీ ఎంపీ వీ హనుమంతరావు, కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా డీసీసీ అధ్యక్షులు డాక్టర్ సి.రోహిణ్ రెడ్డి హాజరయ్యారు. పారిశుద్ధ్య కార్మికులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అంబర్‌పేట డివిజన్‌లో జరిగిన జన్మదిన వేడుకల్లో రోహిణ్‌రెడ్డి , మాజీ కార్పొరేటర్లు పులిజగన్, దిడ్డి రాంబాబు, గరిగంటి శ్రీదేవి, నారయణస్వామి, నాయకులు శంబుల ఉషశ్రీ, శంబుల శ్రీకాంత్‌గౌడ్, గడ్డం శ్రీధర్, రవికుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో..

సోనియాగాంధీ జన్మదిన వేడుకలను శనివారం బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం ప్రధాన కార్యదర్శి సి.హెచ్.పర్వతాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియూసీ రాష్ట్ర అధ్యక్షులు అంజిరెడ్డి సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బి.ఎల్.ఎస్.వర్మ, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.